సాక్షి
ప్రకాశం

శనివారం । 19 । జూలై । 2025



అర్ధాకలి..అగచాట్లు

జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలల నిర్వహణను ప్రభుత్వం గాలికొదిలేసింది. కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. - 8లో..



కరుణించిన వరుణుడు

జిల్లా వ్యాప్తంగా గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34 /25

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

వీఏఏల బదిలీలపై హైకోర్టు స్టే

బేస్తవారిపేట: విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ బదిలీల్లో అన్యాయం జరిగిందని హైకోర్టుకు ఏడుగురు వీఏఏలు వెళ్లారు. స్పౌజ్ కోటా, వికలాంగులు, సీనియారిటీని పరిగణలోకి తీసుకోలేదని, సీనియారిటీ ఉన్న వీఏఏలు ఎంచుకున్న ప్రదేశాల్లో జూనియర్‌లను నియమించడం, రాజకీయ నాయకుల ప్రమేయంతో ఏకపక్షంగా ఎంచుకున్న చోట కాకుండా వేరే ప్రాంతాలకు బదిలీ చేయడం చట్ట విరుద్ధంగా జరిగిందని కోర్టుకెళ్లారు. చోళ్లవీడు ఆర్‌ఎస్‌కే వీఏఏ సుమంత్‌బాబు, సలకలవీడు టీ రమణారెడ్డి, గుడిపాటిపల్లి దుర్గం జిలానీ, రాజుపాలెం కేవీ ధనూషా శ్రీ, కంభం టీ చెన్నారెడ్డి, ఎంపీ చెరువు ఎం బాలకృష్ణ, పెద్ద ఓబినేనిపల్లె ఏ శ్రీనివాసులు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఈనెల 23వ తేదీ వరకు కోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు ఇచ్చింది.

విద్యుత్ సరఫరా లేక జీజీహెచ్‌లో రోగుల అవస్థలు



చీకట్లో వార్డుల్లో రోగులు

మార్కాపురం: మార్కాపురం జీజీహెచ్‌లో శుక్రవారం ఉదయం 4 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం అర్ధరాత్రి నుంచి మార్కాపురం ప్రాంతంలో వర్షం కురిసింది. దీంతో జీజీహెచ్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులు ఫ్యాన్లు, లైట్లు లేక చీకట్లో ఇబ్బందులు పడ్డారు. ఆపరేషన్ చేయించుకున్నవారు తీవ్రమైన ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. జీజీహెచ్‌లో జనరేటర్ సౌకర్యం ఉన్నా వేయలేదని పలువురు రోగులు తెలిపారు. సాయంత్రం సమయంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

21న మీటర్ రీడర్స్ చలో విజయవాడ



పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న మీటర్ రీడర్స్

కంభం: మీటర్ రీడర్స్ డిమాండ్‌ల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 21న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మీటర్ రీడర్స్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం చలోవిజయవాడ పోస్టర్స్ ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీటర్ రీడర్స్ అందరికీ ప్రత్యామ్నాయ ఉపాధి చూపించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. విజయవాడలో జరిగే కార్యక్రమానికి అందరూ తరలిరావలని కోరారు. మీటర్ రీడర్స్ కాశిరెడ్డి, పిట్టల శ్రీను, రామక్రిష్ణ, నారాయణ, నాసర్ పాల్గొన్నారు.

పడిపోతున్న పొగాకు సరాసరి ధరలు

టంగుటూరు: పొగాకు సరాసరి ధరలు రోజు రోజుకీ అమాంతం పడిపోతున్నాయి. గత సంవత్సరం 40 నుంచి 50 పొగాకు కంపెనీలు వేలంలో పాల్గొనేవి. ఇప్పుడు కేవలం 20 కంపెనీలే పాల్గొంటున్నాయి. అందులో కూడా చాలా కంపెనీలు మొక్కుబడిగా పాల్గొంటున్నాయని రైతులు అంటున్నారు. వేలం ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నా బోర్డు ఉన్నతాధికారులు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసర ధర రూ.197.87 పలికింది. వేలం కేంద్రానికి కారుమంచి గ్రామానికి చెందిన రైతులు వేలానికి 957 బేళ్లను తీసుకురాగా వాటిలో 798 బేళ్ల కొనుగోలు చేశారు. 159 పొగాకు బేళ్ల తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280 కాగా, కనిష్ట ధర రూ.160, సరాసరి రూ.197.87 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 25 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ఆగని తిరస్కరణ పొగాకు బేళ్లు

కొండపి: రోజు రోజుకీ తిరస్కరణ బేళ్లు పెరుగుతున్నా అటు ప్రభుత్వం, ఇటు బోర్డు అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. బోర్డు అధికారులు ఆర్డర్లు వచ్చాయి ఏ రకం పొగాకునైనా కొనుగోలు చేస్తామని చెబుతున్నా అది ఆచరించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తిరస్కరణ బేళ్ల వేలం కేంద్రం నుంచి ఇంటికి తీసుకొని పోయి మళ్లీ కేంద్రానికి తీసుకురావాలంటే ఒక్కో బేలుకు వందల్లో ఖర్చవుతుందని రైతులు వాపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. శుక్రవారం నెన్నూరుపాడు, మూగచింతల, గుర్రపడియ, సతుకుపాడు, కె.అగ్రహారం గ్రామాలకి చెందిన రైతులు 1223 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 822 కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 401 తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160, సరాసరి రూ.223.64 ధర పలికింది.

సాగు ఖర్చులు పెరగడం, కనీస గిట్టుబాటు ధరలు కూడా దక్కకపోవడంతో ఈ ఏడాది మళ్లీ మిర్చి సాగు చేసేందుకు రైతులు వెనకాడుతున్నారు. దారుణంగా పడిపోయిన ధరలు రైతులను కుదేలయ్యేలా చేశాయి. మంచి ధర దక్కకపోతుందా అన్న ఆశతో కోల్డ్ స్టోరీజీల్లో పెట్టుకుని కొందరు రైతులు ఎదురు చూస్తుంటే.. మరికొందరు అప్పుల భారం తట్టుకోలేక వచ్చినకాడికి తెగనమ్ముకుని నష్టపోతున్నారు. ఈ సీజన్‌లో మిర్చి సాగుకు సమయమైనా చేతిలో పెట్టుబడులకు డబ్బులు లేక, మళ్లీ ధర వస్తుందన్న ఆశలు అడుగంటి రైతులు మొగ్గుచూపకపోవడంతో సాగు విస్తీర్ణం భారీగా పడిపోయే అవకాశం ఉంది.

మిరప నారుమడి



కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి (ఫైల్)

ఎర్రబంగారం.. రైతుకు భారం

- మిర్చి సాగు వైపు చూడని రైతులు
- మద్దతు ధర లభించక కుదేలు
- ఎకరాకు రూ.50 వేలు నష్టం
- క్వింటా రూ.10 వేలకు పడిపోయిన ధర
- జూలై, ఆగస్టు నెలల్లో సాగుకాలం మొదలు
- ఇప్పటి వరకూ సాగుకు ముందుకు రాని రైతులు
- గత ఏడాది 55,823 ఎకరాల్లో సాగు
- ఈ ఏడాది భారీగా పడిపోతున్న విస్తీర్ణం

సాక్షిప్రతినిధి ఒంగోలు:

మిర్చి సాగు చేసిన రైతు కంట్లో కారం పడుతోంది. గిట్టుబాటు ధర లేక విలవిల్లాడిపోతున్నారు. గుంటూరు యార్డులోనే క్వింటా ధర రకాన్ని బట్టి రూ.10 వేల నుంచి రూ.11 వేల మధ్య కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు సాగుచేసిన మిర్చిని మంచి ధర వచ్చే వరకు కోల్డు స్టోరేజీల్లో నిల్వ ఉంచుకుంటున్నారు. గత రెండు నెలల నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది మిర్చిసాగు గణనీయంగా తగ్గే అవకాశాలున్నాయి. గిట్టుబాటు ధరలేక పెట్టుబడుల డబ్బులు రాక మిర్చి రైతులు అవస్థలు పడుతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు మిర్చి ఎర్రబంగారం కాగా నేడు భారంగా మారింది. 2021–22, 2022–23 సంవత్సరాల్లో క్వింటా మిర్చి ధర రూ.25 వేల నుంచి రూ.30 వేల మధ్య పలికింది. గతేడాది నుంచి ధరలు తగ్గుతూ వచ్చాయి. గతేడాది నవంబరులో రూ.15 నుంచి రూ.16 వేలు ఉన్న ధర ఫిబ్రవరి నాటికి రూ.11 వేలకు కూడా చేరలేదు. దీంతో ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లడంతో ప్రభుత్వం కొనుగోళ్లపై దృష్టిపెట్టింది. అయినా నష్టాలే మిగిలాయి. ఎకరా మిర్చిసాగుకు సుమారు లక్ష నుంచి రూ.1.25 లక్షల వరకూ ఖర్చు వస్తోంది. గతేడాది మిర్చికి తెగుళ్ల ఆశించడంతో అటు దిగుబడి తగ్గిపోయి, ఇటు గిట్టుబాటు ధరలేక తీవ్రంగా నష్టపోయారు. దీంతో ఈ ఏడాది మిర్చి సాగు చేయాలంటేనే రైతులు భయపడుతున్నారు. జిల్లా మొత్తం మీద ఈ సీజన్‌లో 500 ఎకరాలకు మించి సాగు కాలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

కష్టాల్లో మిర్చి రైతులు...

జిల్లాలో గత ఏడాది మిర్చి 55,823 ఎకరాల్లో సాగు చేశారు. నవంబరులో క్వింటా ధర రూ.16 వేల నుంచి రూ.17 వేలు ఉండగా డిసెంబరు నాటికి రూ.15 వేలకు చేరింది. ఈ ఏడాది జనవరిలో రూ.14 వేలకు తగ్గి ఇప్పుడు రూ.10 వేలు మాత్రమే ధర పలుకుతోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి గుంటూరు మార్కెట్ యార్డుకు మిర్చి నిల్వలు ఎక్కువగా రావడంతో ధర తగ్గిపోయింది. వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేశారు. పశ్చిమ ప్రకాశంలో కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు పండించిన మిర్చిని బస్తాల్లో పెట్టుకుని గుంటూరుకు వెళ్తున్నారు. దీంతో రాను.. పోను లారీ బాడుగ కింద సుమారు రూ.15 నుంచి రూ.20 వేల ఖర్చు వస్తోంది. మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చిని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నా ప్రభుత్వం వైపు నుంచి స్పందన లేదు. ఎకరా మిర్చి సాగుకు సుమారు రూ.లక్ష నుంచి రూ.1.25 లక్షల వరకూ ఖర్చుపెట్టారు. ఎకరాకు 15 క్వింటాళ్ల వరకూ దిగుబడులు రావచ్చని రైతులు భావించినా తెగుళ్లతో 12 క్వింటాళ్లకే పరిమితమయ్యాయి. వచ్చిన దిగుబడులకు కూడా కనీస మద్దతు ధర లేకపోవడంతో కోత కోసేందుకు కూలీల ఖర్చు పెరిగిపోవడంతో చాలా మంది రైతులు మిర్చి కోత చేయకుండానే పొలంలో వదిలేసిన సంఘటనలు గ్రామాల్లో చోటు చేసుకున్నాయి. మరికొందరు రైతులు మంచి ధర దక్కకపోతుందా అన్న ఆశతో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నారు. ఇంకొందరు రైతులు అప్పుల వాళ్ల ఒత్తిళ్ల తట్టుకోలేక వచ్చినకాడికి తెగనమ్ముకుని నష్టాలు మిగిల్చుకున్నారు. దీంతో ఈ సీజన్‌లో మిర్చి పంటకు ప్రత్యామ్నాయంగా పత్తి, ఆముదం పంటలు సాగు చేసేందుకు మొగ్గుచూపుతున్నారు.

మిర్చిసాగు చేయాలంటే భయంగా ఉంది



మిర్చి సాగు చేయాలంటే భయంగా ఉంది. గతేడాది 5 ఎకరాల్లో మిర్చి సాగు చేస్తే నష్టాలే మిగిలాయి. వైరస్ తెగులు సోకడంతో దిగుబడులు పూర్తిగా తగ్గాయి. యార్డులో తక్కువ ధరకు అడిగారు. దీంతో ఈ ఏడాది మిర్చిసాగు చేద్దామా.. వద్దా ? అన్న సందేహంలో ఉన్నా. మార్కాపురంలో మిర్చి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

– దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మిర్చి రైతు, తర్లుపాడు

ఆరు ఎకరాలు సాగుచేసి ఇబ్బంది పడ్డా



గతేడాది ఆరెకరాల్లో మిర్చి సాగుచేసి ఇబ్బందిపడ్డాను. మిర్చికి వైరస్ తెగులు సోకింది. దీంతో ఎకరాకు 12 నుంచి 14 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుందనుకుంటే ఆశించిన దిగుబడి రాలేదు. నవంబరులో ఉన్న ధర ఫిబ్రవరి నాటికి తగ్గిపోయింది. దీంతో ఎకరాకు సుమారు 3 క్వింటాళ్ల వరకూ దిగుబడి తగ్గింది. క్వింటాకు రూ.12 వేల ప్రకారం వేసుకున్నా 3 క్వింటాళ్లకు రూ.36 వేల నష్టం వచ్చినట్టే. దీంతో ఈ ఏడాది మిర్చి సాగుచేయాలంటేనే ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– యం.వెంకటేశ్వర్లు, మిర్చి రైతు, గొట్లగట్టు

గతేడాది జిల్లాలో మిర్చి సాగు ఇలా...

మండలం	ఖరీఫ్ సాగు (ఎకరాల్లో)
మార్కాపురం	2657.52
దోర్నాల	5817.10
పెద్దారవీడు	4543.83
వై పాలెం	10409.49
త్రిపురాంతకం	5767.35
పుల్లలచెరువు	8098.75
గిద్దలూరు	893.33
రాచర్ల	1086
కొమరోలు	152.31
బేస్తవారిపేట	910.59
కంభం	342.23
అర్ధవీడు	2207.97
తర్లుపాడు	1520.42
దొనకొండ	1386.30
కురిచేడు	2078.14
ముండ్లమూరు	2552.10
దర్శి	1331.42
కొనకనమిట్ల	765.01
పొదిలి	641.69
తాళ్లూరు	259.02
నాగులుప్పలపాడు	510.21
మద్దిపాడు	14.81
చీమకుర్తి	88.23
మర్రిపూడి	676.82
హనుమంతునిపాడు	57.77
వెలిగండ్ల	186.81
కనిగిరి	471
కొండపి	85.51
సంతనూతలపాడు	134.97
టంగుటూరు	9.45
పొన్నలూరు	10.25
పీసీ పల్లి	186.05
సీఎస్‌పురం	8.05
పామూరు	23

నమ్మించి మోసగించడమే బాబు నైజం

- హామీల అమలులో కూటమి విఫలం
- క్యూఆర్ కోడ్ ప్రతి ఇంటికీ తీసుకెళ్లండి
- మాట తప్పిన నాయకులు వస్తే నిలదీయండి
- బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీలో వైఎస్సార్ సీపీ నేతలు కారుమూరి, బూచేపల్లి, శ్యామల, బత్తుల



బాబు మోసాల క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న నాయకులు

దర్శి: ఎప్పుడు ఎన్నికలు వచ్చినా నమ్మించి మోసం చేయడం బాబు నైజమని, ఇచ్చిన మాటకు కట్టుబడి 100 శాతం హామీలు అమలు చేయడం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నైజమని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. దర్శి పట్టణంలోని బూచేపల్లి నివాసంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ అర్హులందరికీ అన్నీ పథకాలు అందిస్తే...ఈవీఎంల ద్వారా సీఎం అయి చంద్రబాబు వైఎస్సార్‌సీపీ వాళ్లకు మేలు చేస్తే పాముకు పాలు పోసినట్లే అని చెబుతున్నారంటే ఆయన ఎంత దుర్మార్గపు ముఖ్యమంత్రో ప్రజలు ఆలోచించాలన్నారు. వైఎస్సార్, వైఎస్ జగన్‌లను చూస్తే ఆరోగ్య శ్రీ, డ్యాంలు, అమ్మఒడి, నాడు–నేడు, కార్పొరేట్ విద్య, సంక్షేమ పథకాలు, అభివృద్ధి చిహ్నాలు గుర్తుకు వస్తాయని, చంద్రబాబును చూస్తే వెన్నుపోటు, నయవంచన, ప్రజలకు హామీలిచ్చి మోసం చేసిన మోసగాడుగా గుర్తుకు వస్తారన్నారు. రాష్ట్రంలో స్కీంలు ఒక్కటీ అమలు కావడం లేదుకానీ స్కాంలు మాత్రం భారీగా జరుగుతున్నాయన్నారు.

మహిళలకు మొండిచేయి

రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల మాట్లాడుతూ చంద్రబాబు తల్లికి వందనం అంటూ అర్హులైన తల్లులకు పథకాలు ఇవ్వకుండా పంగనామాలు పెట్టారన్నారు. దీపం పథకంలో సంవత్సరానికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్తే ఆ దీపం వెలగకుండానే ఆరిపోయిందని ఎద్దేవా చేశారు. పిఠాపురం పీఠాధిపతి పవన్ తన సొంత జిల్లాలో మహిళకు అన్యాయం జరిగితే మాట్లాడరు కానీ పక్క రాష్ట్రాల్లో ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే తోలు తీస్తా, నారతీస్తా అంటారని అన్నారు. సకల శాఖా మంత్రి లోకేష్ జగన్న పథకాలు అన్నీ తానే సృష్టించానని ప్రచారం చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాత్రి బొద్దింక అని చెప్పి తెల్లవారు జామున వెంట్రుక అని చెప్పే మహిళా హోంమంత్రి కూటమి పాలనలో ప్రతి గంటకు ఒక ఆడబిడ్డకు అన్యాయం జరుగుతుంటే ఒక్కరోజు కూడా వచ్చి మాట్లాడలేదని మండిపడ్డారు.

జీవితాంతం జగనన్నతోనే పయనం

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ తమ జీవితాంతం వైఎస్ జగనన్నతోనే పయనిస్తామని, నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పొదిలి పర్యటనలో టీడీపీ వాళ్లు తప్పులు చేస్తే దాచి పెట్టి అమాయకులను జైల్లో పెట్టారన్నారు. సెంటర్లో బ్యానర్లు వేస్తామంటే అధికార పార్టీ వాళ్లు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ నాయకులు రౌడీలు, గూండాల్లా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. గుడివాడలో బీసీ మహిళా జెడ్పీ చైర్‌పర్సన్ పై దాడి చేస్తే మహిళా హోం మంత్రి అయి బాధితురాలిపైనే కేసులు పెట్టించడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గంలో కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని, అంతకు రెండు రెట్లు మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ధైర్యంగా పోటీ చేసి మన సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ మార్కాపురంలో నిర్వహించిన సభలో 15 ఏళ్లు కూటమి ప్రభుత్వంలో ఉంటామని చెప్పడమే జగనన్న అంటే వాళ్లకు పట్టుకున్న భయాన్ని స్పష్టం చేస్తుందన్నారు. జగనన్నకు వస్తున్న ఆదరణ చూసి ఈవీఎంల ద్వారా అధికారంలోకి వచ్చిన కూటమికి దడపట్టుకుందని చెప్పారు. మద్యం, ఇసుక, గ్రావెల్, రేషన్ మాఫియాలు రాజ్యమేలుతున్నాయని మండిపడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జెండాలు, ఫ్లెక్సీలు కట్టనీయడం లేదని కనీసం కార్యక్రమాలకు కళ్యాణ మండపాలు కూడా ఇవ్వకుండా ఆపితే కార్యక్రమాలు ఆగిపోవని, అంతకు రెట్టింపు ఉత్సాహంతో భారీగా కార్యకర్తలు హాజరయ్యారన్నారు. క్యూఆర్ కోడ్‌ను ప్రతి ఇంటికి చేర్చి చంద్రబాబు ఇచ్చిన హామీలు– చేసిన మోసాలు ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని పిలుపునిచ్చారు. పొగాకు రైతుల కోసం వచ్చిన జగనన్నను కలవడానికి వస్తే 40 మంది పై కేసులు పెట్టారన్నారు. తాను రాజకీయాల్లో ఉన్నంత కాలం జగనన్నతోనే ఉంటానని స్పష్టం చేశారు.

ఒంగోలు పార్లమెంట్ పార్టీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ జగన్న హయాంలో ఆయన పేరు చెప్పి సంపాదించుకుని, అధికారంలో లేనప్పుడు ఒకరు పార్టీని వదిలి వెళ్తే.. జిల్లాను మరింత బలోపేతం చేసే మంచి నాయకుడుగా బూచేపల్లిని జగనన్న ఎంపిక చేశారన్నారు. చంద్రబాబు మోసాల గురించి చెప్పాలన్నా... రాజన్న, జగనన్న సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాల గురించి చెప్పాలన్నా ఒకరోజు సరిపోదని ఎద్దేవా చేశారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు కేవీ రమణారెడ్డి, ఎంపీపీలు బొడిచర్ల ఉషామురళి, సుంకర సునీతా బ్రహ్మానందరెడ్డి, దర్శి, కురిచేడు, ముండ్లమూరు, తాళ్లూరు, దొనకొండ మండలాల కన్వీనర్లు వెన్నపూస వెంకటరెడ్డి, యన్నాబత్తిన సుబ్బయ్య, చింతాశ్రీనివాసరెడ్డి, తూము వెంకటసుబ్బారెడ్డి, కాకర్ల కృష్ణారెడ్డి, యూత్ జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గాలిముటి దేవప్రసాద్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కొల్లా ఉదయభాస్కర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు పోశం మధుసూదన్‌రెడ్డి, కుమ్మిత అంజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కేవీరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు ఆవుల జ్యోతి, మేడం మోహన్‌రెడ్డి, తుళ్లూరి బాబురావు, జెడ్పీటీసీలు నుసుం నాగిరెడ్డి, తాతపూడి రత్నరాజు, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, మాజీ ఎంపీపీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



భారీగా హాజరైన ప్రజలు

పేదరికాన్ని రూపుమాపటమే లక్ష్యం

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ, ఇతర అధికారులు

ఒంగోలు సబర్బన్: పేదరికాన్ని రూపుమాపడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పి–4 విధానాన్ని రూపొందించిందని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. శుక్రవారం ఒంగోలు కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేసీ ఆర్ గోపాల కృష్ణతో కలసి మండల స్థాయి అధికారులతో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా అర్హులైన బంగారు కుటుంబాలను, మార్గదర్శకులను గుర్తించాలని జిల్లా అధికారులు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. జిల్లాలో 74 వేల 911 బంగారు కుటుంబాలను ప్రాథమికంగా గుర్తించామన్నారు. వీరికి కావాల్సిన అవసరాలను గుర్తించడంతోపాటు వాటిని సమకూర్చి ఆయా కుటుంబాలకు అండగా ఉండే మార్గదర్శకులను కూడా ఈ నెల 25వ తేదీ లోపు గ్రామ, వార్డు సభలు నిర్వహించి గుర్తించాలన్నారు. సచివాలయం వారీగా మ్యాపింగ్ ప్రక్రియ పటిష్టంగా చేపట్టాలన్నారు. ఆగస్టు 15వ తేదీలోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఈనెల 19న స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించడంతో పాటు ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్ రెడ్డి, జాన్సన్, సత్యనారాయణ, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డ్వామా, డీఆర్డీఏ, మెప్మా, హౌసింగ్ పీడీలు జోసెఫ్ కుమార్, నారాయణ, శ్రీహరి, శ్రీనివాస ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్, డీటీసీ సుశీల, డీసీఓ పద్మశ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాల శంకరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ పెంచితే సహించం



సైలెన్సర్లను ధ్వంసం చేయడాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

- ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరిక

ఒంగోలు టౌన్: మాడిఫైడ్ సైలెన్సర్లతో విపరీతమైన శబ్దాలు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకొంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ తీవ్రంగా హెచ్చరించారు. గత 6 నెలల కాలంలో ఒంగోలు నగర పరిధిలో ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న 550 మాడిఫైడ్ సైలెన్సర్లను శుక్రవారం మంగమూరు రోడ్డులోని రత్నదీప్ స్టోర్స్ సెంటర్లో రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేశారు. కార్యక్రమాన్ని ఎస్పీ దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొందరు ఆకతాయిలు ఉద్దేశ పూర్వకంగానే కాలేజీలు, బహిరంగ ప్రదేశాల్లో అధిక శబ్దం చేసుకుంటూ తిరుగుతున్నట్లు తమ దృష్టికి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. మాడిఫైడ్ సైలెన్సర్ల వలన అధిక శబ్దాలు వస్తాయని, దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. మోడిఫైడ్ సైలెన్సర్లను వాడడం మోటారు వాహనాల చట్టాన్ని ఉల్లంఘించడమేనని, చట్టప్రకారం ఇది నేరమన్నారు. కార్యక్రమంలో కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ట్రాఫిక్ ఎస్సైలు కోటయ్య, శ్రీనివాసరావు, శివప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


వెంకటయ్య మృతదేహం

రాచర్ల: మండలంలోని ఎడవల్లి క్రాస్ రోడ్డు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలు.. మండలంలోని గుండ్రెడ్డిపల్లె గ్రామానికి చెందిన నల్లబోతుల వెంకటయ్య (74) గుండ్రెడ్డిపల్లె నుంచి గిద్దలూరు వైపుగా వస్తున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఎస్సై పి.కోటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నల్లగుంట్ల హత్య కేసులో నిందితులకు బేడీలు

- కేసు వివరాలు వెల్లడించిన సీఐ ప్రభాకర్‌రావు


నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ, ఎస్సైలు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని నల్లగుంట్లలో గత నెల 4వ తేదీన జరిగిన బైరబోయిన వెంకటేశ్వర్లు హత్య కేసులో నిందితులకు పోలీసులు బేడీలు వేశారు. వారిని శుక్రవారం మీడియా ఎదుట ప్రవేశ పెట్టారు. సీఐ ప్రభాకర్‌రావు, ఎస్సై మహేష్ కథనం ప్రకారం.. తన భర్త హత్యకు గురయ్యాడని బైరబోయిన వెంకటేశ్వర్లు భార్య విజయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితులు మొద్దు తిరుపతిరావు, బైరబోయిన బాల తిరుమలయ్య, మొద్దు వెంకటేశ్వర్లు, మొద్దు రాంకుమార్‌లతో పాటు మరో మైనర్ బాలుడిని గుర్తించి అరెస్టు చేశారు. హతుడు వెంకటేశ్వర్లు 2022వ సంవత్సరం ఫిబ్రవరి 2వ తేదీన మొదటి నిందితుడు సోదరుడైన మొద్దు వెంకటేశ్వర్లును కొర్రప్రోలు వద్ద నరికి చంపాడు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న సదరు నిందితులు పథకం ప్రకారం గత నెల 4వ తేదీన నల్లగుంట్లలో పీర్ల పండగ జరుగుతున్న సమయంలో పీర్లకు మొక్కుతున్న బైరబోయిన వెంకటేశ్వర్లును కత్తులతో దాడి చేసి చంపారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులు మండల పరిధిలోని కొర్రప్రోలు వద్ద ఉన్నట్లు తెలుకుని అక్కడికి వెళ్లారు. నిందితులను అరెస్టు చేసి కటకటాల వెనక్కి నెట్టినట్లు సీఐ ప్రభాకరరావు తెలిపారు.

కరుణించిన వరుణుడు!


కురిచేడు : కాటంవారిపల్లెలో రైల్వే బ్రిడ్జి కింద వరద ఉధృతి

ఒంగోలు సబర్బన్: వరుణుడు ఎట్టకేలకు కరుణించాడు. గత పది రోజులుగా ఉష్ణోగ్రతలు పెరిగి.. పంటలు మొలకదశలోనే వాడు ముఖం పడుతుండటంతో దిగాలు చెందిన రైతులకు వానదేవుడు కాస్త ఊరటనిచ్చాడు. జిల్లా వ్యాప్తంగా గురువారం అర్ధరాత్రి మొదలుకొని శుక్రవారం తెల్లవారే వరకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా యర్రగొండపాలెంలో 122.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా పామూరు మండలంలో 5.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. టంగుటూరు మండలంలో 88 మిల్లీమీటర్లు, కొత్తపట్నం 77.4, మద్దిపాడు 70.2, జరుగుమల్లి 68.4, తాళ్లూరు 59.8, దర్శి 54.6, సంతనూతలపాడు 52.6, తర్లుపాడు 49.8, పుల్లలచెరువు 49.4, బేస్తవారిపేట 46.4, రాచర్ల 46.2, దొనకొండ 43.6, పెద్దారవీడు 42.8, చీమకుర్తి 40, సింగరాయకొండ 39.4, మార్కాపురం 36.2, పొన్నలూరు 32.4, నాగులుప్పల పాడు 30.2, గిద్దలూరు 26.8, కొండపి 21.4, పెదచెర్లోపల్లి 21.2, అర్ధవీడు 20.2, పొదిలి 19.6, కంభం 19.4, దోర్నాల 18.6, మర్రిపూడి 18.6, కొమరోలు 17.2, కనిగిరి 16.6, కొనకనమిట్ల 15.6, కురిచేడు 15, ముండ్లమూరు 14.2, హనుమంతునిపాడు 11.2, ఒంగోలు రూరల్ 10.2, ఒంగోలు అర్బన్ 10.2, వెలిగండ్ల 8, సీఎస్‌పురం 7, త్రిపురాంతకం మండలంలో 6.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

భారీ వర్షానికి కూలిన పొగాకు బ్యారన్


జమ్ములపాలెంలో కూలిన పొగాకు బ్యారన్

టంగుటూరు: భారీ వర్షానికి పొగాకు బ్యారన్ కూలింది. ఈ సంఘటన మండలంలోని జమ్ములపాలెంలో శుక్రువారం రాత్రి జరిగింది. బాధిత రైతు నరగర్ల కొండయ్య కథనం ప్రకారం.. భారీ గాలి, ఉరుములు, మెరుపులు, వర్షం ధాటికి ఒక్కసారిగా బ్యారన్ కుప్ప కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రూ.5 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దీనిపై బోర్డు అధికారులకు సమాచారం అందించానని స్పష్టం చేశాడు.

అర్ధాకలి.. అగచాట్లు!

గుండె తరుక్కుపోయేలా.. కళ్లు చెమర్చేలా గిరిజన చిన్నారుల పరిస్థితి

'వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలు రాకుండా చూడాలి. వారికి అక్షయపాత్ర ద్వారా నాణ్యమైన ఆహారం అందించాలి'
ఇవీ గిరిజన సంక్షేమ శాఖపై సమీక్షలో సీఎం నారా చంద్రబాబునాయుడు చెప్పిన మాటలు..
'ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఏఎన్‌ఎంలను నియమిస్తాం' ఇదీ గత ఏడాది నవంబర్‌లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేసిన ప్రకటన..
ఇవేవీ వాస్తవ రూపం దాల్చలేదు సరికదా ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల కష్టాలు రెట్టింపయ్యాయి. బుక్కెడు కూటికి, గుక్కెడు మంచినీటికి మొహం వాచిపోయిన గిరిజన చిన్నారుల పరిస్థితి చూస్తే ఎవరికైనా గుండె తరుక్కుపోవాల్సిందే.

- పుల్లలచెరువు మండలం మురికిమళ్ల ఆశ్రమ పాఠశాలలో అమలు కాని మెనూ
- అపరిశుభ్రంగా క్యాంపస్.. వర్కర్స్ లేక పనులన్నీ విద్యార్థులతోనే..
- 162 మంది పిల్లలకు పాఠాలు చెబుతోంది 8 మంది టీచర్లే..
- 13 మంది టీచర్ల కొరతతో బోధన సక్రమంగా లేదని తల్లిదండ్రుల ఆవేదన


ప్లేట్లు శుభ్రం చేసుకునేది.. దాహం తీర్చుకునేది ఆ నీటితోనే..


చపాతీలోకి సాంబారును తలపించే ఆలూ కుర్మా

యర్రగొండపాలెం:

జిల్లాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల నిర్వహణను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. కనీస మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో ఎక్కడ అంటు వ్యాధులు ప్రబలుతాయోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ సక్రమంగా అమలు కాక గిరిజన బాలలు అర్ధాకలితో అలమటిస్తున్న పరిస్థితి. జిల్లాలో మొత్తం 14 ప్రభుత్వ గిరిజన పాఠశాలల్లో సుమారు రెండు వేల మంది చిన్నారులు చదువుకుంటున్నారు. పుల్లలచెరువు మండలంలోని మురికిమళ్ల, గారపెంట, యర్రగొండపాలెం మండలంలోని పాలుట్ల, అల్లిపాలెం, దద్దనాల(శాంతినగర్), అల్లిపాలెం(హనుమంతుని గూడెం), బిల్లగొందిపెంట, దోర్నాల మండలంలోని తుమ్మలబైలు, చింతల, మర్రిపాలెం, బీఎంసీ కాలనీ, చిలకచెర్ల, పెద్దమంతనాల, పెద్దారవీడు మండలంలోని చింతలముడిపి, అర్ధవీడు మండలంలోని భీమరాయునిచెరువు గూడెంలో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో అరకొర వసతులతోపాటు పారిశుధ్య లోపం స్పష్టంగా కనిపిస్తోంది. 1963లో ఇచ్చిన జీవో ప్రకారం ఇప్పటికీ ఆశ్రమ పాఠశాలల నిర్వహణ కొనసాగుతుండటం గిరిజనులపై పాలకుల సవతి ప్రేమను తేటతెల్లం చేస్తోంది. నాటి జీవో ప్రకారం 30 మంది విద్యార్థులు ఉన్న ఆశ్రమ పాఠశాలలో నలుగురు వర్కర్లు సేవలు అందించేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో 240 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో కూడా ఇద్దరు లేదంటే ముగ్గురు వర్కర్లు మాత్రమే పనిచేస్తుండటం గమనార్హం.


మురికిమళ్ల ఆశ్రమ పాఠశాలలో కటిక నేలపై కూర్చుని అల్పాహారం తింటున్న చిన్నారులు

వంట పని.. పాచి పని విద్యార్థులతోనే..

పుల్లలచెరువు మండలంలోని మురికిమళ్లలో ఉన్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. పాఠశాలలో రక్షిత మంచి నీరు లేక పోవడంతో ఓవర్ హెడ్ ట్యాంక్‌లో నిల్వ ఉన్న నీటిని తాగుతున్నారు. ఈ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు వివిధ ప్రాంతాలకు చెందిన 162 మంది గిరిజన బాలికలు ఆశ్రయం పొందుతూ విద్యనభ్యసిస్తున్నారు. వీరికి 21 మంది ఉపాధ్యాయులు పాఠాలు బోధించాల్సి ఉంది. కానీ ఇక్కడ 8 మంది ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలోనూ ఒకరిద్దరు నిత్యం సెలవులో ఉంటారని విద్యార్థులు చెబుతున్నారు. యర్రగొండపాలెం-మాచర్ల రహదారి సమీపంలో ఉన్న ఈ పాఠశాల పరిస్థితి ఇలా ఉందంటే.. ఇక రాకపోకలకు సరైన మార్గం లేని అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన గిరిజన ఆశ్రమ పాఠశాలల నిర్వహణ ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. మురికిమళ్ల ఆశ్రమ పాఠశాలలో రెండు రోజుల క్రితం వరకు కేవలం ఇద్దరు మాత్రమే వర్కర్లు ఉండేవారు. వీరు వంట, పారిశుధ్య పనులు నిర్వహించాల్సి ఉంది. వర్కర్లు తక్కువగా ఉండటంతో అన్ని పనులు బాలికలతోనే చేయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. 8 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థినులు విడతల వారీగా వంట పనుల్లో నిమగ్నమై ఉంటున్నారు. గత ఆదివారం తమ పిల్లలతోనే చపాతీలు చేయించారని, పారిశుధ్య పనులకు కూడా పిల్లలనే వాడుతున్నారని తల్లిదండ్రులు పేర్కొనడం పాఠశాలలో పరిస్థితికి అద్దం పడుతోంది. అటవీ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న తాము శుభ్రంగా ఉంటామని, అలాంటి పరిస్థితి ఆశ్రమ పాఠశాలల్లో కనిపించడం లేదని తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు.


వడ్డన, క్లీనింగ్ పనులు ఒకే చోట...

రామరాజ్యం జగన్‌తోనే సాధ్యం

- అన్ని వర్గాలనూ చంద్రబాబు వంచించారు
- అబద్ధపు హామీలతో గద్దెనెక్కి అరాచకం సృష్టిస్తున్నారు
- ఏడాదిలోనే రూ.1.70 లక్షల కోట్ల అప్పుతో రాష్ట్రం అధోగతిపాలు
- మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ధ్వజం


మాట్లాడుతున్న ఆదిమూలపు సురేష్

మర్రిపూడి: రామరాజ్యం కావాలంటే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన మర్రిపూడి పడమటి బజారులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక పాలన నడుస్తోందని, అధికారులు సైతం పాలకులకు తొత్తులుగా మారారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా సూపర్-6 పథకాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మంది పిల్లలకు తల్లికి వందనం పథకం అందిస్తామని చెప్పి చివరకు తల్లులను మోసం చేశారని ధ్వజమెత్తారు. అర్హులైన వృద్ధులు, వితంతువులకు పింఛన్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఫ్రీ బస్ సౌకర్యం కల్పిస్తానని ఏడాదిగా మహిళలను మభ్యపెడుతూ వస్తున్నారని, అన్నదాత సుఖీభవ పథకాన్ని గత ఏడాది ఎగ్గొట్టి రైతులను నిలువునా మోసం చేశారని దుయ్యబట్టారు. నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు చెల్లించకుండా విద్యార్థులను అన్యాయం చేశారని, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పేరుతో గృహిణులకు మొండి చేయిచూపారని నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తుంటే బెదిరింపులకు పాల్పడుతూ.. అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. పచ్చ నేతలు మద్యం బెల్ట్ దుకాణాలు, అక్రమ రేషన్ దందా, ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగిస్తున్నారని, ఎమ్మెల్యేలు, మంత్రి సైతం కమీషన్ దండుకుంటున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. భూ ఆక్రమణలు, నిధుల దోపిడీని కట్టడి చేయకపోగా.. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ రాష్ట్రాన్ని అధోగతి పాలుచేస్తున్నారని విమర్శించారు. సంపద సృష్టించడమంటే ఏడాది వ్యవధిలో రూ.1.70 లక్షల కోట్లు అప్పు చేయడమేనా అని ప్రశ్నించారు. అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకునేంత వరకు వైఎస్సార్ సీపీ పోరాటాన్ని ఆపబోమన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ ఆశయాలు కొనసాగాలంటే పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని, వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఇనుకొల్లు సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మాకినేని సుధారాణి వెంకట్రావు, నియోజకవర్గ రైతు విభాగం, ఎంప్లాయర్స్, పెన్షనర్ విభాగం అధ్యక్షులు బొల్లినేని నాగేశ్వరరావు, పెట్లూరి కృష్ణమూర్తి, సర్పంచ్ కదిరి భాస్కర్, వైస్ ఎంపీపీ ఎస్‌కే నాసర్, ఇనుకొల్లు మాదిరెడ్డి, ఇనుకొల్లు జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా వైఎస్సార్ సీపీ


శ్రీనివాసులరెడ్డి కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న బుర్రా

గుడ్లూరు: వైఎస్సార్ సీపీలో పనిచేసిన కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని బసిరెడ్డిపాలెం పంచాయతీ చెంచిరెడ్డి పాలేనికి చెందిన నరాల శ్రీనివాసులరెడ్డి పార్టీలో రైతు విభాగం అధ్యక్షుడిగా పనిచేశారు. ఇటీవల ఆయన ఆత్మహత్య చేసుకోవడంతో పార్టీ శ్రేణులు బుర్రా దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే బుర్రా మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డికి శ్రీనివాసులరెడ్డి విషయం చెప్పారు. వెంటనే జగన్ బాధిత కుటుంబానికి రూ.1 లక్ష అందించాలని బుర్రాను ఆదేశించారు. మరో రూ.1 లక్షను కలిపి మొత్తం రూ.2 లక్షలను శ్రీనివాసుల రెడ్డి కుటుంబానికి బుర్రా అందించారు. దీంతో కుటుంబ సభ్యులు మాజీ సీఎం జగన్‌కు, బుర్రాకు కృతజ్ఞతలు తెలిపారు.

జీతం పెంచే వరకు సమ్మె ఆపేది లేదు

- ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికుల నిరసన


నగరపాలక సంస్థ కార్యాలయంలో ధర్నా చేస్తున్న కార్మికులు

ఒంగోలు సబర్బన్: తమకు జీతం పెంచేంత వరకు సమ్మె ఆపేది లేదని ఒంగోలు నగర పాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు తెగేసి చెప్పారు. ఈ మేరకు శుక్రవారం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తొలుత కార్మికులు కార్యాలయం ముందు రోడ్డులో మానవహారంగా ఏర్పడ్డారు. సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు, యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నేపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ జీవో, సమ్మె కాలపు ఒప్పందాల జీవో ఇచ్చేంత వరకు నగరంలో సమ్మె కొనసాగుతుందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ప్రజలకు సేవ చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కరించకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ధ్వజమెత్తారు. ఏడేళ్ల నుంచి జీవో నెంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్‌లో పనిచేస్తున్న కార్మికులకు రూ.21 వేల జీతం, స్కిల్ వర్కర్‌కు రూ.24 వేల జీతం ఇవ్వాలని గత సమ్మెలో ఒప్పందం చేసుకున్న సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, సమస్యలు పరిష్కరించకుంటే పట్టణాలు, నగరాలు కంపుకొడతాయని, మున్సిపల్ యూనియన్ పోరాటానికి ఇతర ప్రజా సంఘాలు కూడగట్టుకొని ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ట్రేడ్ యూనియన్స్‌ను కలుపుకొని ప్రభుత్వం మెడలు వంచి కార్మిక వర్గం సాధించుకున్న విజయాలు అనేకం ఉన్నాయని గుర్తుచేశారు. మున్సిపల్ పోరాటానికి మద్దతుగా పెన్షనర్స్ యూనియన్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు పాల్గొని కార్మికులకు మద్దతు పలికారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.సామ్రాజ్యం, యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు జి.నరసింహ, టి.విజయమ్మ, జాలయ్య, శంకర్, శివమ్మ, శ్రీదేవి, ఆర్.శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, కె.మోహన్‌రావు, భారతి, వంశి, బి.బాబు, ఎం.బాబు, జేమ్స్, అనిత, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్‌డీఎస్‌ఎస్ పనులు వేగవంతం చేయాలి

- పీఎం సూర్య ఘర్ పురోగతి పెరగాలి
- విద్యుత్ బకాయిల విషయంలో నిర్లక్ష్యం వీడాలి
- విద్యుత్ శాఖ అధికారుల సమీక్షలో సీఎండీ పుల్లారెడ్డి


అధికారులతో సమీక్షిస్తున్న సీఎండీ పుల్లారెడ్డి, డైరెక్టర్లు, ఎస్‌ఈ కట్టా వెంకటేశ్వర్లు

ఒంగోలు సబర్బన్: ఆర్‌డీఎస్‌ఎస్ పథకం పనులు వేగవంతం చేయాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్థానిక సంతపేటలోని విద్యుత్ భవన్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షించారు. సమావేశంలో కేంద్ర, రాష్ట్రాల ముఖ్య పథకాలైన ఆర్డీఎస్ఎస్, పీఎం సూర్య ఘర్ పురోగతిపై లోతుగా సమీక్షించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, పరివర్తకాల పనితీరు, విద్యుత్ శాఖపై ప్రజల అభిప్రాయం, విద్యుత్ కలెక్షను, బకాయిలపై సబ్ స్టేషన్ల వారీగా సమీక్షించారు. ఆర్డీఎస్ఎస్ పనులు వేగవంతం చేయాలని, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే విషయంలో అధికారులు ఎవరూ నిర్లక్ష్యం వహించకుండా త్వరగా పనులు పూర్తి చేయాలని, జిల్లాలో సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు అధికంగా ఏర్పాటు చేయడం కోసం ప్రతి ఒక్క విద్యుత్ అధికారికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించారు. అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ అందరికీ అందించాలని, దానికోసం ఫీడర్ పెట్రోలింగ్ చేసి లోపాలను సరి చేయాలని తద్వారా ప్రజలకు విద్యుత్ శాఖపై నమ్మకం పెరుగుతుందని చెప్పారు. ప్రజలకు స్మార్ట్ మీటర్లపై ఉన్న అపోహలను తొలగించాలని, ప్రతి ఒక్కరికి స్మార్ట్ మీటర్ ఆవశ్యకతను తెలియజేస్తూ మారుతున్న సమాజంలో స్మార్ట్ మీటర్‌తో కలిగే ఉపయోగాలు వివరించాలని సూచించారు. సమావేశంలో ఏపీ సీపీడీసీఎల్ డైరెక్టర్లు మురళీకృష్ణ యాదవ్, వెంకటేశ్వర్లు, ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఈఈలు, డీఈఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.